## గంజాయి మొక్కలో ఔషధ గుణాలు!

### వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ వెల్లడి



వాషింగ్టన్, ఆగస్టు 10: గంజాయి మొక్కల్లో (కన్నాబిస్) ఔషధ గుణాలున్నాయా లేదా అనే అంశంపై అనేక ఏండ్లుగా పరిశోధనలు సాగుతున్నాయి. తాజాగా వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. దీనిపై 'సైంటిఫిక్ జర్నల్' కథనం ప్రకారం, గంజాయి మొక్క కాండం, పుష్పం..ఇలా వివిధ భాగాల నుంచి లభించే పదార్థాల్ని సైకోయాక్టివ్‌గా పేర్కొంటారు. ఇందులో నుంచి ఉత్పన్నం చేసిన 'కన్నాబిజిరోల్' (సీబీజీ) వినియోగంపై సైంటిస్టులు హ్యూమన్ ట్రయల్స్ నిర్వహించగా, ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 34 మందిపై సీబీజీని ప్రయోగించగా, వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు తగ్గాయి. అలాగే జ్ఞాపకశక్తి కూడా గణనీయంగా మెరుగుదల కనిపించిందని సైంటిస్టులు గుర్తించారు.

## 850 కోట్ల విలువైన కాలిఫోర్నియం సీజ్

### బీహార్‌లో స్మగ్లింగ్ ముఠా అరెస్ట్



పాట్నా: ముగ్గురు సభ్యుల అక్రమ రవాణా ముఠాను అరెస్ట్ చేసిన బీహార్ పోలీసులు వారి నుంచి రూ.850 కోట్ల విలువైన 50 గ్రాముల రేడియో యాక్టివ్ పదార్థం 'కాలిఫోర్నియం'ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము దాదాపు రూ.17 కోట్లు పలికే ఈ పదార్థాన్ని అణు విద్యుత్తు కేంద్రాలు మొదలుకొని క్యాన్సర్ చికిత్స వరకు వివిధ రంగాల్లో వివిధ రూపాల్లో వాడుతుంటారు. తమ వద్దనున్న ఈ పదార్థాన్ని విక్రయించేందుకు కొన్ని నెలలుగా ఈ గ్యాంగ్ ప్రయత్నిస్తున్నట్టు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు బాల్‌థారి చెక్‌పోస్టు వద్ద నిందితులను కాపుకాసి పట్టుకున్నారు. వారు తమను తాము ఐఐటీ మద్రాస్‌కు చెందిన వారిగా చెప్పుకున్నారని, నిందితుల వద్ద ల్యాబ్ టెస్ట్ రిపోర్టు కూడా ఉన్నదని గోపాల్‌గంజ్ ఎస్పీ స్వర్ణ్ ప్రభాత్ తెలిపారు. అయితే, ఐఐటీ మద్రాస్‌ను సంప్రదించిన తర్వాత వారు చెప్తున్నది అబద్ధమని తేలిందని పేర్కొన్నారు. కాలిఫోర్నియంను కొనడం, విక్రయించడం దేశంలో చట్టరీత్యా నేరం కావడంతో అసలు అది వారికి ఎలా దొరికింది? ఎవరు కొనుగోలు చేయబోతున్నారు? అన్నదానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. సీజ్ చేసిన పదార్థాన్ని పరీక్ష కోసం అణుశక్తి విభాగానికి పంపినట్టు తెలిపారు. మూడేండ్ల క్రితం లక్నోలో 8 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి 340 గ్రాముల కాలిఫోర్నియంను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ఆ పదార్థం గ్రాము విలువ రూ.19 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. కాగా, తాజా కేసులో అరెస్ట్ అయిన నిందితులు తమకు ఆ పదార్థాన్ని బొగ్గు గనిలో పనిచేసే వ్యక్తి ఇచ్చినట్టు తెలిపారు.

## మహా విస్ఫోటనం వెంటనే విశ్వం అంతమయ్యేది!

### బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం సరికాకపోవచ్చు



కాలిఫోర్నియా, ఆగస్టు 10: విశ్వం ఆవిర్భావం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. సమాధానం కనుగొనేందుకు దశాబ్దాలుగా సైంటిస్టులు శోధిస్తున్నారు. మహా విస్ఫోటనం తర్వాత ప్రాథమిక మూలకాలు బోసన్ అనే రేణువుల సాయంతో ఒకదానితో ఒకటి ఢీకొని ద్రవ్యరాశి ఏర్పడిందనేది బిగ్ బ్యాంగ్(మహా విస్ఫోటనం) థియరీ. అయితే, ఈ సిద్ధాంతం తప్పు అయి ఉండవచ్చని మూలకాలు, దైవ కణాలు(హిగ్స్ బోసన్ పార్టికల్) ఆధారంగా చేసిన తాజా పరిశోధన చెప్తున్నది. లండన్ కింగ్స్ కాలేజీ పరిశోధకుల వాదన ప్రకారం, ఒకవేళ నిజమే అయితే మహా విస్ఫోటనం జరిగిన వెంటనే విశ్వం అంతమయ్యేది. విశ్వం ఆవిర్భావానికి సంబంధించి అన్ని సిద్ధాంతాలూ తప్పే అయ్యి ఉండాలి. ప్రాథమిక మూలకాలు అనేవే లేకపోయి ఉండాలి. విశ్వ అవిర్భావానికి కారణమేదో భౌతిక శాస్త్రం తెలుసుకోలేకపోతున్నది.

# బంగ్లా చీఫ్ జస్టిస్ రాజీనామా

- నిరసనకారుల సుప్రీం కోర్టు ముట్టడితో నిమిషాల్లో పదవికి ఒబైదుల్ హసన్ గుడ్‌బై
- పదవి నుంచి తప్పుకున్న బంగ్లా బ్యాంక్ గవర్నర్
- పలువురు జడ్జీలు, వీసీలు సైతం రాజీనామా
- తమపై దాడులకు నిరసనగా హిందువుల ఆందోళన

ఢాకా, ఆగస్టు 10: బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు, సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామాకు ఒత్తిడి చేసి విజయవంతమైన నిరసనకారులు మిగతా ప్రధాన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకున్నారు. శనివారం ఉదయం వందలాది మంది నిరసనకారులు, విద్యార్థులు, న్యాయవాదులు సుప్రీంకోర్టు ప్రాంగణంలోకి చేరారు. గంట సేపట్లో ప్రధాన న్యాయమూర్తి రాజీనామా చేయాలని, లేకపోతే న్యాయమూర్తుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.



హసన్

దీంతో తప్పని పరిస్థితుల్లో బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ ఒబైదుల్ హసన్ తన పదవికి రాజీనామా సమర్పించారు. న్యాయమూర్తుల భద్రత దృష్ట్యా తాను రాజీనామా చేసినట్టు ఆయన ప్రకటించారు. హసన్ రాజీనామా తమకు అందిందని పార్లమెంటరీ వ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. ఒబైదుల్ హసన్ తర్వాత మరో ఐదుగురు న్యాయమూర్తులు సైతం రాజీనామా చేశారు. కాగా, సుప్రీంకోర్టు ఫుల్ మీటింగ్ నిర్వహించేందుకు ప్రధాన న్యాయమూర్తి సిద్ధమయ్యారని, తాత్కాలిక ప్రభుత్వం చట్టవిరుద్ధమని ఆయన ప్రకటించాలని అనుకున్నారని నిరసనకారులు ఆరోపించారు. మరోవైపు, బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్ రౌఫ్ తాలుక్‌దర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు బ్యాంకు ప్రాంగణంలో ఆందోళన చేశారు. ఢాకా యూనివర్సిటీ వీసీ మక్సూద్ కమల్, ఎస్‌యూఎస్‌టీ వీసీ ఫరీదుద్దీన్ అహ్మద్ సైతం రాజీనామా చేశారు.



ఢాకాలో సుప్రీంకోర్టు ఎదుట విద్యార్థుల ఆందోళన

**మేమూ బెంగాలీలమే...**

తమపై దాడులను నిరసిస్తూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో హిందువులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తమపై, తమ ఆలయాలు, ఇండ్లపై జరుగుతున్న దాడులకు నిరసన తెలిపారు. తామూ బెంగాలీలమే అని, హిందువులకు కూడా బంగ్లాదేశ్‌లో నివసించే హక్కు ఉందని పేర్కొంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హసీనా రాజీనామా తర్వాత హిందువులపై దాడులు జరిగాయి. ఒక హిందూ స్కూల్ టీచర్, ఇద్దరు కౌన్సిలర్‌లను అల్లరిమూకలు హతమార్చాయి. హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఖండించారు. దాడులు హేయమైనవని, హిందూ, క్రైస్తవ, బౌద్ధ కుటుంబాలకు రక్షణగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

### 'హసీనాతో బలవంతంగా రాజీనామా చేయించలేదు'

షేక్ హసీనా రాజీనామా చేయలేదని, తలపై తుపాకీ గురిపెట్టి..పదవీ నుంచి దింపేశారని ఆమె కుమారుడు సాజీద్ వాజెద్ ఆరోపించారు. అయితే ఈ ఆరోపణల్ని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) జనరల్ సెక్రెటరీ మీర్జా ఫక్రూల్ అలంగిర్ ఖండించారు. శనివారం భారత్‌కు చెందిన ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉండటమా? దేశాన్ని వీడటమా? అనే రెండు ఎంపికలు ఆ రోజు హసీనా ముందు ఉన్నాయని, దేశాన్ని వీడాలన్నది ఆమె నిర్ణయమని అలంగిర్ అన్నారు. మాజీ ప్రధాని ఖలీదా జియా ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, ఆమె ఆరోగ్యం కుదటపడ్డాక ఎన్నికల్లో బీఎన్‌పీకి నేతృత్వం వహిస్తారని అన్నారు. దేశంలో హింస, అల్లర్లు హఠాత్తుగా సంభవించిన ఘటనలుగా పేర్కొన్నారు. తమ దేశ మాజీ ప్రధాని హసీనాకు ఆశ్రయం ఇచ్చే ముందు భారత దేశం ఆలోచించుకోవాలని అలంగిర్ అన్నారు. ఆమెకు ఆశ్రయం ఇవ్వడం వల్ల ప్రజల మధ్య సంబంధాలపై ప్రభావం పడుతుందని.. అన్ని దేశాలూ మనకు మిత్రులు కావాలని అన్నారు.

## 'ఖైదీ' ముద్ర.. ప్రజాస్వామ్యానికి సవాల్

- తన చేతిపై వేసిన గుర్తును షేర్ చేసిన జార్ఖండ్ సీఎం
- తనకే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితేమిటని ప్రశ్న



రాంచీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా జైల్లో తన చేతిపై వేసిన 'ఖైదీ' ముద్రను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఇది నా చేతిపై వేసిన స్టాంపే కాదు, దేశ ప్రజాస్వామ్యం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఒక చిహ్నమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలవుతున్న సమయంలో జైలు అధికారులు తన చేతిపై ఈ ముద్ర వేశారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు, ఫిర్యాదులు, నేరం లేకుండా ప్రజలు ఎన్నుకొన్న ఒక సీఎంగా ఉన్న తనను 150 రోజుల పాటు జైల్లో ఉంచారని అన్నారు. తన పరిస్థితే ఇలా ఉంటే.. ఇక సామాన్య గిరిజనులు, దళితులు, అణగారిన వర్గాల ప్రజల విషయంలో ఏ విధంగా వ్యవహరిస్తారో ఇక చెప్పనవసరం లేదని అన్నారు. ఈ రోజు నుంచి అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం మరింత సమర్థవంతంగా పోరాడాలని సంకల్పించుకొన్నానని పేర్కొన్నారు. మతం, కులం, రంగు, అలవాట్లు ఇతరత్రా ఆధారంగా అణచివేత, అన్యాయానికి గురైన ప్రతి వ్యక్తి, ప్రతి వర్గం తరపున తాను గొంతెత్తుతానని సొరేన్ తెలిపారు. చట్టం అందరికీ సమానమనేలా, అధికార దుర్వినియోగం లేని సమాజాన్ని నిర్మించుకొనేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

## మోదీ, షా రక్షణలో రాహుల్

### పౌరసత్వం కేసులో సుబ్రమణ్య స్వామి విమర్శ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత నేత రాహుల్ గాంధీని బ్రిటిష్ పౌరసత్వం కేసులో కాపాడుతున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి శనివారం హెచ్చరించారు. రాహుల్ 2003లో బ్రిటిష్ పౌరసత్వం తీసుకున్నారని, బ్యాక్‌ఆప్స్ అనే కంపెనీని లండన్‌లో ఏర్పాటు చేశారని, అందువల్ల ఆయన భారతీయ పౌరసత్వం చెల్లదని సుబ్రహ్మణ్య స్వామి ఆరోపిస్తున్నారు. రాహుల్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మోదీ, షాలను స్వామి ఎక్స్ పోస్ట్‌లో నిలదీశారు. ఈ అంశంపై తాను 2019లో విదేశాంగ శాఖకు చేసిన ఫిర్యాదు నకలును ఈ పోస్ట్‌లో జత చేశారు. అయితే, ఈ ఫిర్యాదు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీకి నోటీసు ఇచ్చినట్లు తెలుస్తున్నది.

## కశ్మీర్‌లో ఎదురుకాల్పులు

- ఇద్దరు సైనికుల మృతి

శ్రీనగర్, ఆగస్టు 10: ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు మరణించారు. అనంత్‌నాగ్ జిల్లా కోకెర్‌నాగ్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులున్నారనే సమాచారంతో శనివారం ఆర్మీ, జమ్ము కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కలిసి సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. దీంతో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు సైనికులు, ఇద్దరు పౌరులకు గాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా ఇద్దరు సైనికులు మరణించారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు.

## హిమాచల్‌లో ఆకస్మిక వరదలు

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి మళ్లీ భారీ వర్షాలు కురవడంతో ఆకస్మికంగా వరదలు పోటెత్తాయి. సహన్‌లో అత్యధికంగా 168.3 మిల్లీమీటర్లు, కందఘట్టిలో అత్యల్పంగా 45.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సహన్, సంధోల్, నగ్రోటా సూరియన్, ధౌలకువాన్ సహ పలుచోట్ల కొండ చరియలు విరిగిపడటంతోపాటు రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నెల 16 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**బద్రీనాథ్ హైవేపై కొండ చరియలు**

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాల వల్ల బద్రీనాథ్ జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగిపడ్డాయి. కమెడ, నందప్రయాగ్, చిన్‌కా ప్రాంతాల్లో కొండ చరియలు పడటం వల్ల రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



## కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సోమనాథన్

### రాజీవ్ గౌబా స్థానంలో నియమించిన కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్‌ను కేంద్ర ప్రభుత్వం శనివారం నియమించింది. 1987 బ్యాచ్‌కు చెందిన తమిళనాడు క్యాడర్ అధికారి సోమనాథన్ ప్రస్తుతం ఆర్థిక కార్యదర్శిగా ఉన్నారు. రాజీవ్ గౌబా స్థానంలో క్యాబినెట్ కార్యదర్శిగా నియమితులైన ఆయన రెండేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. సోమనాథన్ 1987లో సివిల్స్‌లో 2వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రొబెషనరీ ఐఏఎస్‌గా బంగారు పతకాన్ని అందుకున్నారు. ఇంతకు ముందు పీఎంవోలో అదనపు కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు.

## లైంగిక సామర్థ్యం లేదని వివాహం రద్దు

ముంబై: ఆగస్టు 10(నమస్తే తెలంగాణ): తన భర్తకు శృంగార(లైంగిక) సామర్థ్యం లేక తనతో శారీరకంగా కలవలేకపోతున్నాడని పేర్కొంటూ ఓ యువతి బాంబే హైకోర్టును ఆశ్రయించగా, ఆ వివాహాన్ని కోర్టు రద్దు చేసింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన యువకుడు, ఛత్రపతి శంభాజీనగర్‌కు చెందిన యువతికి మార్చి 13న వివాహం జరిగింది. మొదటి రాత్రి, హనీమూన్‌లో యువకుడు యువతిలో శృంగారంలో పాల్గొనకపోవడంతో యువతి మనస్తాపం చెందింది. ఇదేమని ప్రశ్నిస్తే.. శృంగారం తన వల్ల కాదని.. తనను వదిలేయాలని యువకుడు వేడుకున్నాడు. దీంతో యువతి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు వీరి వివాహాన్ని రద్దు చేసింది.

## యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ కన్నుమూత

న్యూఢిల్లీ, ఆగస్టు 10: యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్కికీ కన్నుమూశారు. 56 ఏండ్ల సుసాన్ గత రెండేండ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. ఇంటర్నెట్‌ను రూపొందించడంలో, గూగుల్ చరిత్రలో ఆమె విశేష పాత్ర పోషించారు. 1990లో గూగుల్‌లో తన కెరీర్‌ను ప్రారంభించిన సుసాన్ యూట్యూబ్ సీఈవోగా 2014 నుంచి 2023 వరకు పనిచేశారు. గూగుల్ చరిత్రలో వోజ్కికీ అతి ప్రధానమైన వ్యక్తని, ఆమె లేని లోకాన్ని ఊహించడం కష్టంగా ఉందని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సంతాపం వ్యక్తం చేశారు.

## వయనాడ్ బాధితులకు తగిన సాయం: మోదీ

వయనాడ్: కేరళలోని వయనాడ్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ప్రధాని మోదీ శనివారం పర్యటించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, బాధితులకు పునరావాసంపై కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాధితులకు ఆర్థిక సాయం, పునరావాసం విషయంలో కేంద్రం తగిన సాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సర్వస్వం కోల్పోయిన వారిని ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు.




వైద్యురాలి హత్యకు నిరసనగా కోల్‌కతాలో జూనియర్ డాక్టర్లు, నర్సులు, మెడికల్ విద్యార్థుల ఆందోళన

## వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య

### కోల్‌కతాలో దారుణం.. నిందితుడు అరెస్టు

కోల్‌కతా, ఆగస్టు 10: కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ శవ పరీక్ష నివేదిక వెలువడింది. ఆమెపై లైంగిక దాడి చేసిన అనంతరం హత్య చేసినట్టు అది నిర్ధారించింది. ఈ కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు హాస్పిటల్‌తో ఎలాంటి సంబంధం లేని బయటి వ్యక్తి అని, ఘటన జరిగిన రోజు అతను దవాఖానలోని అన్ని విభాగాలలో స్వేచ్ఛగా తిరిగాడని పోలీసులు శనివారం తెలిపారు. అతని కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయని, ఈ నేరంతో అతడికి ప్రత్యక్ష సంబంధం ఉన్నట్టు అనుమానిస్తున్నట్టు వారు చెప్పారు. అతడిని సెల్దా కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజుల పోలీస్ రిమాండ్‌కు ఆదేశించింది. ఛాతీ వైద్య విభాగంలో పీజీ రెండో సంవత్సరం విద్యార్థిని అయిన బాధితురాలు గురువారం రాత్రి డ్యూటీలో ఉండగా ఆమెను హత్య చేశారు. సెమినార్ హాల్‌లో అర్ధనగ్నంగా పడిఉన్న ఆమె దేహంపై గాయాల గుర్తులున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు డాక్టర్లను కూడా పోలీసులు విచారిస్తున్నారు. తన కుమార్తెపై అత్యాచారం చేసి హత్య చేశారని బాధితురాలి తండ్రి ఆరోపించారు. అయితే వాస్తవాలు కప్పిపుచ్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇది ఒక దురదృష్టకర ఘటన అని, హంతకుడికి ఉరి శిక్ష వేయించడానికి తమ ప్రభుత్వం వెనుకాడదని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు.



## ప్లేట్లలో గుడ్లు పెట్టి వెంటనే లాగేసుకున్నారు

### కర్ణాటకలో అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ సస్పెండ్

బెంగళూరు, ఆగస్టు 10: చిన్న పిల్లలకు పెట్టిన ఆహారాన్ని ఎవరైనా లాగేసుకుంటారా? కానీ కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఓ అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ఆ పని చేశారు. కప్పాల్ జిల్లా కారంటాగి తాలూకా గుందుర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది చేసిన ఈ మోసంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. పిల్లల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరించిన అంగన్‌వాడీ హెల్పర్, వర్కర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పిల్లలతో ప్రార్థన చేయించిన వెంటనే కొన్ని సెకన్ల వ్యవధిలో వారి ప్లేట్ల నుంచి గుడ్లను అంగన్‌వాడీ హెల్పర్, వర్కర్ తీసేసుకున్న తీరు వీడియోలో రికార్డైంది. పిల్లలకు గుడ్డు పెట్టామని చూపుకునేందుకే సిబ్బంది ఇలాంటి మోసం చేశారని తెలుసుకొని ప్రజలు అవాక్కయ్యారు.

## కర్ణాటకలో 3% హామీలే అమలు

- ప్రజారోగ్యం, విద్య, ఉపాధిపై నిర్లక్ష్యం
- కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనపై 'సిటిజన్స్' సంస్థ నివేదిక
- మ్యానిఫెస్టో అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని విమర్శ



బెంగళూరు, ఆగస్టు 10: చేసిన వాగ్దానాలు కొండంత.. అమలు చేసినవి కూసింత.. ఇదీ కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని దుస్థితి. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఆ పార్టీ కేవలం మూడు శాతం వాగ్దానాలు మాత్రమే పూర్తిగా అమలు చేసింది. సిటిజన్స్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. మొత్తం 59 వాగ్దానాల్లో కేవలం రెండింటిని మాత్రమే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం పూర్తిగా అమలు చేసిందని తెలిపింది. ఆ నివేదిక ప్రకారం అత్యంత ప్రధానమైన ప్రజారోగ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఇచ్చిన ఆరు హామీల్లో ఒక్కటీ అమలు పర్చలేదు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది, వైద్యుల ఖాళీలను భర్తీ చేస్తామని, జాతీయ రహదారి వెంబడి ప్రతి 100 కి.మీకు ఒక ట్రామా సెంటర్‌ను ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన వాగ్దానాల మాటే సిద్ధరామయ్య ప్రభుత్వం మరిచిపోయింది. విద్యారంగంలో ఇచ్చిన ఏడు హామీల్లో ఒక్కటి, ఉపాధి రంగంలో 15 వాగ్దానాల్లో ఒక్కటి నెరవేర్చగా, పర్యావరణంపై చేసిన ఒక్క హామీ పేపర్‌కే పరిమితమైంది. పారిశ్రామిక రంగంలో 11 వాగ్దానాల్లో రిక్తహస్తమే మిగిల్చింది. బెంగళూరు అభివృద్ధికి చేసిన ఐదు హామీలు గాలిలో కలిసిపోయాయి. మ్యానిఫెస్టో అమలుపై కాం గ్రెస్‌కు చిత్తశుద్ధి కరువైందని సివిక్ బెంగళూరు సభ్యురాలు కాత్యాయనీ విమర్శించారు.

## ప్రజలు నా మాట వినలేదనే రాజీనామా

### రాజస్థాన్ మంత్రి కిరోడీలాల్ మీనా

జైపూర్: ప్రజలకు 45 ఏండ్ల నుంచి సేవ చేస్తున్నానని, అయినప్పటికీ వారు తన మాట వినలేదని, అందుకే తాను రాజస్థాన్ మంత్రి పదవికి రాజీనామా చేశానని బీజేపీ నేత కిరోడీ లాల్ మీనా చెప్పారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా దౌసాలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లను రద్దు చేస్తారనే వార్తలను ఖండించారు. ఈ విషయంలో తాను తన సమాజంతో కలిసి అంకితభావంతో పని చేస్తానని చెప్పారు. తూర్పు రాజస్థాన్‌లో ఏడు లోక్ సభ స్థానాలు ఉన్నాయి. వీటన్నిటిలోనూ బీజేపీ గెలుస్తుందని, కనీసం ఒక స్థానంలో బీజేపీ ఓడిపోయినా తాను రాష్ట్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ఆయన గతంలో ప్రకటించారు.

## 2 వేల కోట్ల క్రిప్టో చోరుడు ఎక్కడ?

- ముమ్మరంగా నిఘా సంస్థల దర్యాప్తు
- లబోదిబోమంటున్న ఖాతాదారులు



ముంబై, ఆగస్టు 10: మన దేశంలో క్రిప్టో కరెన్సీ లావాదేవీలు ఎక్కువగా జరిగే వజీర్‌ఎక్స్ సంస్థలోని ఖాతాదారులకు గత నెలలో పెద్ద షాక్ తగిలింది. పలు అంచెల భద్రత ఉన్నప్పటికీ పలువురు వాలెట్లు (ఖాతాల) నుంచి కోట్లాది రూపాయల డిజిటల్ కరెన్సీ వేరే ఖాతాల్లోకి తరలిపోయింది. దీంతో వారు లబోదిబోమంటూ విషయాన్ని వజీర్‌ఎక్స్ దృష్టికి తెచ్చారు. అయితే వారు అప్రమత్తమయ్యే లోపు రూ.2,000 కోట్ల(230 మిలియన్ డాలర్లు) డిజిటల్ ఆస్తులు దొంగతనానికి గురయ్యాయి. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అతి పెద్ద క్రిప్టో కరెన్సీ చోరీ వెనుక నిందితుల కోసం నిఘా సంస్థలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

**అసలెలా జరిగింది?**

తొలుత ఒక వజీర్‌ఎక్స్‌లో ఒక వాలెట్‌ను తెరచిన సైబర్ చోరుడు దానిలోకి 230 మిలియన్ డాలర్లను వివిధ క్రిప్టో కరెన్సీ రూపాల్లోకి బదిలీ చేశాడు. అలాగే హవాలా నగదు బదిలీకి వినియోగించే టోర్నడో క్యాష్ నుంచి ఆ వ్యాలెట్‌కు ఒక లావాదేవీ ద్వారా నిధులు సమకూరినట్టు కనిపించింది. జూలై 10 నుంచి 18 వరకు వజీర్‌ఎక్స్‌లోని వివిధ ఖాతాల నుంచి డిజిటల్ ఆస్తుల అపహరణ మొదలైంది. అలా అపహరించిన మొత్తాన్ని వివిధ క్రిప్టో కరెన్సీలలోకి మార్చి చిన్న చిన్న మొత్తాలలో రెండు వేరే ఎక్స్ఛేంజ్‌లలోని పలు ఖాతాలలోకి సదరు దొంగ బదిలీ చేశాడు. 2 వేల లావాదేవీలు జరిపి అపహరించిన మొత్తాన్ని ఖాతాల్లోకి పంపాడు.

**దొంగ సొత్తు ఖర్చు పెట్టగలడా?**

నిందితుడు ఇంతవరకు ఆ ఖాతాలలోని మొత్తాన్ని వినియోగించ లేదు. దీనిని వినియోగించుకోవాలంటే వాస్తవ ప్రపంచంలోకి వచ్చి దానిని డాలర్, రూపాయి వంటి కరెన్సీగా మార్చుకోవాల్సి ఉంటుందని, అప్పుడు అతని నిజ రూపం వెల్లడి కాక తప్పదని సైబర్ నిపుణులు అంటున్నారు. సైబర్ నేరగాడు ప్రస్తుతం 61,000 ఈథరమ్‌లు (ఒక్క ఈథరమ్ రూ.2 లక్షలకు పైగా విలువ చేస్తుంది) మూడు వ్యాలెట్లలో దాచి ఉంచినట్టు నిపుణులు కనుగొన్నారు. ఈ వ్యాలెట్లలో ఎలాంటి కదలికలు ఏర్పడినా అతడిని కనిపెట్టడానికి నిఘా సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. భారీ మొత్తం ఏదైనా ఉగ్రవాద సంస్థలకు నిధులను సమకూర్చడానికా? అనే కోణంలోనే దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి.

## గాజాలో బడిపై ఇజ్రాయెల్ దాడి

### 80 మంది మృతి



జెరూసలేం, ఆగస్టు 10: గాజాలో శరణార్థులు తలదాచుకున్న ఓ స్కూల్‌పైనా ఇజ్రాయెల్ విచక్షణారహితంగా వైమానిక దాడులకు తెగబడింది. శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనలో కనీసం 80 మంది చనిపోయి ఉంటారని పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. గత 10 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇది అత్యంత దారుణమైన ఘటనగా వారు పేర్కొన్నారు. గుర్తించలేని విధంగా మృతదేహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. అయితే సెంట్రల్ గాజాలోని తబీన్ స్కూల్‌లో హమాస్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుందని, అందుకే దాన్ని లక్ష్యంగా చేసుకున్నామని ఇజ్రాయెల్ మిలటరీ వర్గాలు తమ చర్యల్ని సమర్థించుకున్నాయి. కాగా, ఇజ్రాయెల్ ప్రకటనను హమాస్ ఖండించింది. యుద్ధంలో శరణార్థులుగా మారిన ప్రజలు ఆ స్కూల్‌లో తలదాచుకున్నారని తెలిపింది. క్షిపణి దాడుల్లో 47 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆరోగ్య శాఖ తెలిపింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఇజ్రాయెల్ సైన్యం ఈ దాడికి తెగబడిందని ఆరోపించింది. గత 8 రోజుల్లో స్కూళ్లపై జరిగిన వైమానిక దాడుల్లో 163 మంది చనిపోయారు. వీటిపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.